


# రూపులేని రాకాసి కోర

- సి. ఆనందారాము

కళ్ళు తెరవాలని ప్రయత్నిస్తున్నాడు రామ్. తెరవలేకపోతున్నాడు.

చుట్టూ ఏవేవో గొంతుకలు - ఎక్కడో ఏదో మరో లోకం నుంచి వినపడుతోన్నట్లుగా ఉన్న సవ్వడులు - ఎవరిదో ఆప్యాయమైన స్పర్శ - ఎవరో, ఎక్కడో కూరుకుపోతున్న తన మనసుకి ఏదో అందించాలని ప్రయత్నిస్తున్నారు.

"కమాన్! ప్రయత్నించు! షైకిరా! కూరుకు పోకు తెరు! కళ్ళు తెరు!....."

బరువుగా మూతలు పడుతోన్న కళ్ళు తెరిచాడు. తన మీదికి వంగి రమేశ్ కుడి పక్క హజీజ్ - ఎదురుగా శోభ, మీనా, రీటా, లీల, జ్యోతి - రెండు చేతులతో చెంపలు వాయిస్తూ తెల్ల కోటులో డాక్టర్ - అందరూ తననే ఆరాటంగా చూస్తున్నారు. అందరి కళ్ళలోనూ స్నేహం.

"మేం ఉన్నాం, నీకు!" అంటూ ధైర్యం చెప్తోన్న ఎన్నో జతల కళ్ళు.

"రామ్! కళ్ళు తెరు - నీకేం కాలేదు - నువ్వు భయపడవలసిన అవసరం లేదు - కళ్ళు తెరు - నిద్ర లోకి జారిపోకు...."

రీటా గొంతు మెత్తగా - దృఢంగా - "రామ్! కమాన్! బీబ్రేవ్! డోన్ట్ యీల్డ్! ఫైట్ ఇట్!" నువ్వు నిద్ర పోవటానికి వీల్లేదు" ఆజ్ఞాపిస్తున్నాడు యతీంద్ర రామ్ పూర్తిగా కళ్ళు తెరిచాడు.

"హి మేడిట్!" సంతోషంతో అరిచాడు డాక్టర్.

కళ్ళు తెరిచిన రామ్‌కి చుట్టు స్నేహితులంతా కనపడటం కొండంత బలాన్ని ఇచ్చింది. వాళ్ళంతా తన పరిస్థితికి ఏమనుకుంటారో, ఏఏ ప్రశ్నలు వేస్తారో అనే ఆందోళన కూడా కల్గింది. అన్నింటికంటే అంతరంతరాల్లో మరో భయం పోలీసుల భయం. కానీ అతని మిత్ర బృందంలో ఏ ఒక్కరూ అతడు ఆ పరిస్థితికి ఎందుకు వచ్చాడు, అనిగాని అతనికి డ్రగ్స్ ఎలా దొరికాయని గాని ప్రశ్నించలేదు. ఏదో మామూలుగా జబ్బు పడ్డాడు అన్నట్లే ప్రవర్తించసాగారు. మూడో రోజున అతడు కళ్ళు తెరిచేసరికి ఎదురుగా తల్లి కూర్చొని ఉంది. ఆమెను చూడగానే రామ్ చటుక్కున ముఖం తిప్పుకున్నాడు. ఆవిడ దిగులు నిండిన పేలవమైన నవ్వుతో అందర్నీ చూసి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. లీల ఇది ఊహించలేక పోయింది. మిగిలిన వాళ్ళు కనుసైగలతో వారిస్తున్నా, వినకుండా "ఏమిటిది రామ్! ఏదో పెద్ద ఘనకార్యం చేసాననుకుంటున్నావా? నీలాంటి వాడే ఆర్నెల్లు సాముచేసి మూల నున్న ముసలమ్మని కొట్టాట్ట. నీ పరిస్థితికి ఆవిడకు అంతకు ముందే ఉన్న గుండెనొప్పి ఎక్కువైంది. డాక్టర్ బెడ్ రెస్ట్ అవసరమని చెబుతోన్నా, వినిపించుకోకుండా నిన్ను చూద్దామని వచ్చింది. ఆ ప్రేమకి నువ్వు చూపించిన ప్రతిఫలం ఇది. నీకు ఆవిడ ముఖం చూట్టానికి కూడా మనస్కరించలేదు. ఏమిటి మహానుభావా! ఆమె చేసిన మహాపాపం?"

"ఏమిటా! ఆ మహాతల్లి మూలంగానే నేనీ దశ కొచ్చాను. ఆవిడే నా జీవితాన్ని సర్వనాశనం చేసింది. ఆవిడ....."

రామ్ పిడికిళ్ళు బిగుసుకొన్నాయి. నిలువునా వణుకుతున్నాడు అతడు. మాట మొద్దు బారిపోతోంది. నర్స్ రామ్ మీదికి వంగి అతన్ని వెనక్కు పడుకోబెడుతూ "రిలాక్స్! రిలాక్స్! అనవసరంగా ఉద్రేక పడకండి. స్థిమితంగా ఉండండి" అంది. హజీజ్, శ్రీనివాసరావు చటుక్కున చెరో ప్రక్కన వచ్చి నిల్చొని కాలేజి కబుర్లు చెబుతూ అతని మనసు మళ్ళించటానికి ప్రయత్నించారు. రాధా, రీటా, లీలని చెరో చెయ్యి పట్టుకొని ఆగదిలోంచి అవతలకి తీసుకుపోయారు.

ఈ సంఘటన తర్వాత రామ్ తల్లి అతణ్ని చూడటానికి రాలేదు. పనిమనిషితో క్యారియర్ పంపించేది. లీల కూడా కనపడ్లేదు..మిగిలిన స్నేహితులంతా వంతుల వారిగా ఎప్పుడూ ఎవరో ఇద్దరు రామ్ ప్రక్కనే ఉన్నారు. శ్రీనివాసరావు అప్పుడప్పుడు క్లాస్‌లో చెప్పిన నోట్స్‌ను చదివి వినిపించేవాడు. రెఫరెన్స్ పుస్తకాలలో తను చదివిన పాయింట్స్‌ని చర్చించేవాడు. అనంత్ న్యూస్ పేపర్స్‌లోని వార్తలు ఏ రోజుకారోజు చదివి వినిపించేవాడు. రీటా టేపు రికార్డర్‌లో పాప్ మ్యూజిక్ క్యాసెట్స్ పెడితే జ్యోతి వాటిని లాగి పారేసి ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి భక్తి గీతాల క్యాసెట్స్ పెట్టేది. ఈ అల్లరికి తన శారీరక బాధ మరిచిపోయి నవ్వేసేవాడు రామ్. ఇలా స్నేహితులంతా నెలరోజుల పాటు అతడి మనసు మళ్ళీ డ్రగ్ వైపు మళ్ళకుండా అతి ప్రయాసతో అతడు కోలుకోవటానికి సహకరించారు.

ఇప్పుడు రామ్ ముఖంలో ఇదువరకటి ప్రేతకళ లేదు. కళ్ళల్లోకి కొత్త కాంతి వచ్చింది. మనిషి మంచంలో పడుకొని ఉండటం లేదు. లేచి తిరుగుతున్నాడు. నిజానికి డాక్టర్ అంతకు పదిహేను రోజుల కిందటే రామ్‌ని డిశ్చార్జి చేస్తానని అన్నాడు. కాని రామ్ తల్లి వచ్చి చేతులు జోడించి "వాడు పూర్తిగా కోలుకునే వరకూ హెల్త్ సెంటర్‌లోనే ఉండనీయండి. వాడు నా ముఖం చూడక పోయినా పర్వాలేదు, పూర్తిగా కోలుకుంటే అంతేచాలు. ఎంత ఖర్చైన భరిస్తాను" అంది. ఆ కారణం చేత అంతగా అవసరం లేకపోయినా డాక్టర్ అతనిని హెల్త్ సెంటర్‌లోని స్పెషల్ రూం లోనే ఉంచేశాడు. అదే రామ్‌కి మేలు చేసింది. హెల్త్ సెంటర్‌లోని స్పెషల్ రూమ్‌లో ఉండబట్టి రామ్ ఫ్రెండ్సందరూ అహర్నిశలు రామ్‌తోనే ఉంటూ అతడు తొందరగా కోలుకోవటానికి సహకరించగలిగారు.

ఆ రోజు డాక్టర్ పరీక్ష చేయడానికి వచ్చినప్పుడు రామ్ నవ్వుతూ "డాక్టర్ గారూ మీరు నాకు మందులు, ఇంజక్షన్లు ఏమీ ఇవ్వడం లేదు, ఇంకా నేనెందుక్కడా? ఎప్పుడు వెళ్ళి పోవచ్చో చెప్పండి." అన్నాడు. "వాళ్ళెప్పుడు నిన్ను వొదిలెయ్య మంటే అప్పుడొదిలేస్తాను" అన్నాడు డాక్టర్.

తనకు శారీరిక రుగ్మత ఏమీ లేదని, రామ్‌కి అర్థమైంది. ఆ మధ్యాహ్నం ఫ్రెండ్స్ వచ్చినప్పుడు "మీరంతా, నా చుట్టూ ఉంటే హెల్త్ సెంటరే ఒక క్లబ్బులాగా ఉంది. కానీ ఇంక నాకు ఇంటికి వెళ్ళాలని ఉంది. వెళ్ళిపోతాను" అన్నాడు.

"ఇంటికా? ఇంటికెందుకు? అక్కడేముంది?"

ఆశ్చర్యం నటిస్తూ అంది జ్యోతి.

ఆ ఆశ్చర్యానికి నిజంగా ఆశ్చర్యపోతూ "ఇంటికి ఎందుకంటావేమిటి?ఎవరైనా ఇంటిక్కాక మరెక్కడికి వెళ్తారు." "ఓహో నీకూ ఇంటి మీద ప్రేమ ఉందన్నమాట. నిజంగా ఆ రాతి గోడలని అభినందించాలి, నీప్రేమ పొందినందుకు" అంది జ్యోతి. రామ్‌కి అర్థమైంది. అతని ముఖం ఎర్రబడింది "నాకు అన్నింటి కంటే మీరే ఎక్కువ. ఇంటికైనా, మీరు వెళ్ళ మంటే నే వెళ్తాను. అన్నట్టు లీల ఏది? కనపడట్లేదే?"

"లీలకి నీ మీద కోపం వచ్చింది. నీతో మాట్లాడనంది" అంది జ్యోతి.

కోపం ఎందుకొచ్చిందని రామ్ అడుగలేదు. కారణం అతనికీ తెలుసు.

"జ్యోతీ! లీలని ఒక్కసారి రమ్మను. తనతో చెప్పకుండా నేనిక్కడ్నుంచి వెళ్ళను. హెల్త్ సెంటర్‌లోనే ఉండిపోతాను" ప్రాథేయ పూర్వకంగా అడిగాడు రామ్.

ఆ సాయంత్రం లీల వచ్చింది. ఒక స్టూల్ ఎడంగా లాక్కొని కూర్చొంది.

"ఇంకా కోపమేనా? " జాలిగా అడగటానికి ప్రయత్నించాడు రామ్. లీల కనుబొమ్మలు చిట్లించి "కోపం దేనికి? నువ్వు చేసే పనులకు కోపం తెచ్చుకొనే స్వభావమే ఉంటే అన్ని రోజులు నీ మంచం వదలకుండా కూర్చొనేదాన్నా?"

"నీకు కోపం ఎందుకొచ్చిందో నాకు తెలుసు ఏం జరిగిందో తెలిస్తే నేను ఎందుకలా ప్రవర్తించానో నీకే అర్థమౌతుంది. మా నాన్నగారు, నాకు పదేళ్ళ వయస్సప్పుడే పోయారు. మా అమ్మ తన అత్తవారింట్లో ఉండకుండా నన్ను తీసుకొని బయటికొచ్చేసింది. ఎవరినో డబ్బున్న వాణ్ని పెళ్ళి చేసుకుంది. ఆ డబ్బుతో నా చదువు సాగుతున్న మాట నిజమే, కాని ఎక్కడికి వెళ్ళినా "మీ రెండో నాన్న నిన్ను బాగా చూస్తున్నారా? మీ అమ్మ ఈ రెండో నాన్నతోనే ఉంటుందా లేకపోతే మూడో నాన్నని తెచ్చిపెడ్తుందా " లాంటి సూటి పోటి మాటలతో నన్ను వేధించే వారు. నేను ఎవరింటికైనా వెళ్తే వాళ్ళు ఆడ పిల్లలు నాతో మాట్లాడుతోంటే, ఇంట్లోంచి పెద్దవాళ్ళు లోపలికి పిలిచి నేను వింటూండగానే "నీతి జాతి లేని కుటుంబం, అటువంటి వాడితో స్నేహం చెయ్యొద్దు" అని మందలించే వారు. మేము నగరం నడిబొడ్డున ఉంటున్నా, మా ఇంటికి ఎప్పుడూ ఎవరూ బంధువులు కాని, స్నేహితులు కాని వచ్చేవారు కారు. ఏదో అడవిలో ఉంటున్నట్లే అనిపించింది. ఇవన్నీ ఒక ఎత్తు. మా రెండో నాన్న ప్రవర్తన మరో ఎత్తు. నేను తారస పడినప్పుడు చీదరింపుగా చూసేవాడు. మాట్లాడించబోతే విసుక్కొని విదిలించేవాడు. మా అమ్మతో జోక్స్ కట్ చేస్తూ సరదాగా మాట్లాడేవాడు, నన్ను పురుగులా చూసేవాడు. మా అమ్మ నిస్సహాయంగా చూడటం తప్ప ఆయనని ఏమీ అనలేక పోయేది. నేను ఇంకా చదువుకుంటూండగానే మా అమ్మని తీసుకొని గదిలోకెళ్ళి తలుపులు వేసేసుకునే వాడు. అతడ్ని జుట్టు పట్టుకొని ఈడ్చి చావబాదాలనే కడుపు మంటని అతి కష్టం మీద అణుచుకునే వాణ్ని. రాను రాను ఇంటా బయటా ఎదురయ్యే ఈ అశాంతి భరించ లేక పోయాను. ఈ సమయంలోనే నాకు విలియమ్‌తో స్నేహం అయింది. నేను అశాంతితో మథనపడుతుంటే "ఇవి తాగు, నీ అశాంతి మాయమై ఆనంద లోకాలలో విహరిస్తావు" అంటూ అది నాకిచ్చాడు. సిగరెట్‌లా ఉంటే దాన్ని వెల్గించి పొగ పీల్చాను. మొదట ఏమీ అనిపించక పోయినా కొన్ని నిముషాల తర్వాత ఈ బాహ్య జగత్తునే మరిచిపోయాను. విలియమ్ చెప్పినట్లే నా అశాంతి దూరమైంది. ఆ రోజు నుంచి ఈ అలవాటుకు బానిసైపోయాను. ఎక్కడ లేని డబ్బు సరిపోయేది కాదు. ఇంకా ఇమ్మని అమ్మను వేధించే వాణ్ని. అమ్మ మాత్రం ఎక్కడ్నుంచి తెస్తుంది. అతడ్నడిగితే అతడు నిర్మోహ మాటంగా 'లేదు'! అనేశాడు. నేను కోపం పట్టలేక డ్రగ్స్‌కు దూరంగా ఉండలేక మా రెండో నాన్న పర్స్‌లో నుంచి డబ్బు దొంగతనం చెయ్యబోతూ పట్టుబడ్డాను. అతడు నన్ను హీనాతి హీనంగా అవమానించటమే కాక చెంప మీద ఛెళ్ళుమని కొట్టాడు. అంతటితో ఆగలేదు. "బాస్టర్డ్! మీ అమ్మ ముఖం చూసి నిన్ను వదిలేస్తున్నాను. లేకపోతే ఈ పాటికి నిన్ను పోలీస్ లాకప్‌లో ఉంచే వాణ్ని బిహేవ్ యువర్ సెల్ఫ్" అన్నాడు. మా అమ్మ స్థాణువులా నిలబడే ఉంది. ఆ సమయంలో కూడా అతడ్ని ఏమీ అనలేదు. పైట కొంగు ముఖానికి అడ్డుపెట్టుకొని ఏడ్చింది, అంతే. ఈ అవమానాలు ఈ హైన్యం భరించలేక పోయాను. నిద్ర మాత్రలు మింగేసాను. మీరంతా ఎలా బతికించారో నాకు తెలియదు......"

"నిన్ను బతికించింది మేము కాదు, మీ అమ్మ ఎంతకీ నిద్ర లేవని నిన్ను ఆటోలో వేసుకొని ఇక్కడికి తీసుకొచ్చింది. నువ్వన్నట్టే ఆవిడకి నీ స్నేహితులమైన మేము తప్ప నా అనే వాళ్ళు ఎవరూ లేరు. జ్యోతికి జరిగిందంతా చెప్పింది. జ్యోతి మిగిలిన అందరికీ చెప్పింది. డాక్టర్ నువ్వు డ్రగ్ అడిక్ట్ అయ్యావని గుర్తించాడు. మేమంతా నిన్ను విడవకుండా నీ పక్కనే ఉండి నీ మనసును డ్రగ్ మీద నుంచి మళ్ళించగలిగితే, వైద్య సహాయంతో నిన్ను మళ్ళీ మామూలు మనిషిని చేస్తానని అన్నాడు. తరువాత నీకు తెలుసు. అయినా రామ్! పరిస్థితులకి తట్టుకోలేక ఎవరైనా డ్రగ్స్‌కి బానిసలవుతారా? నా కథ విను. నీకు కనీసం ప్రేమించే అమ్మైనా ఉంది, ఒకవేళ ఆవిడ నీ చదువులకీ, నీ పెంపకానికి డబ్బు కోసమే మీ రెండో నాన్నని పెళ్ళి చేసుకుందేమో. నాకు పదేళ్ళ వయసులోనే అమ్మ పోయింది. అమ్మ పోయిన ఆరు నెలల్లోగానే సవతి తల్లి వచ్చింది. ఆనాటి నుంచి తల్లి ప్రేమకే కాదు తండ్రి ప్రేమకు కూడా దూరమయ్యాను. ఇంట్లో నాగోడు పట్టించుకునే వాడే లేడు. సవతి తల్లికి అయిందానికి కానిదానికి సతాయించి కాల్చుకు తినడానికి నేను దొరికాను. ఒక మనిషికి మరో మనిషి మీద పెత్తనం చెలాయించాలంటే ఇంత ఆనందంగా ఉంటుందా? లోకువగా దొరికిన వాళ్ళని నిర్దాక్షిణ్యంగా వేధించే ఈ క్రౌర్యం మానవ సహజ స్వభావమా? నాకేమీ అర్ధమయ్యేది కాదు. అప్పుడప్పుడు చెయ్యి చేసుకునేది.

"కాని నన్ను చదువు మానిపించటం మాత్రం ఆవిడ తరం కాలేదు. ఒకసారి కొట్టి, బలవంతాన బడి మానిపించి ఇంట్లో కూచో బెట్టింది. అవకాశం దొరగ్గానే ఇంట్లోంచి పారిపోయి స్కూల్ కెళ్ళిపోయాను. రెండిళ్ళలో పనిమనిషిగా పనిచేస్తానని జీతం కూడా మాట్లాడుకొని ఇంటికెళ్ళకుండా వుండిపోయాను. అక్కడితో చుట్టు పక్కల పెద్ద గొడవ చెలరేగింది. చుట్టు పక్కల ఇళ్ళల్లోని పెద్ద మనుషులు మా నాన్న దగ్గరికి వచ్చి నువ్వు బతికి వుండి కన్న కూతురిని పనిమనిషిగా పంపిస్తావా! అని చీవాట్లు పెట్టారు. నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాక మొదటి సారిగా నా సవతి తల్లితో పోట్లాడాడు. "ఇంట్లో దాన్నెంతైనాచంపుకో. ఇల్లు మాత్రం వీధిన పడెయ్యకు." అని లైసెన్స్ ఇచ్చేశాడు. ఆ నాటి నుంచి నా బతుకు ఇంట్లో ఎంత నరకంగా తయారైనా, చదువుకు మాత్రం ఆటంకం కలగలేదు. మా సవతి తల్లి తిట్లను బాలమురళి సంగీతంలా ఊహించుకుంటూ, అవి నా మనసును చికాకు పెట్టకుండా కాపాడుకుంటూ నా చదువు నెగ్గించుకుంటూ వచ్చాను. మెట్రిక్ పాసయ్యాక చదువు మాన్పించి పెళ్ళి చేస్తానని కూర్చొంది మా సవతి తల్లి. అంతేకాదు నన్ను ఒక రోగిష్టి ముసలాడికి

"మనమిద్దరం ఒకే సంసార రథాన్ని లాగవలసిన వారం. నీకు నన్ను మించి ఇక ఎవరూ ఈ లోకంలో హితైషులు కారనీ, నీకు నా కంటే అధికులూ, ప్రేమించేవారూ ఎవరూ లేరనీ అనుకున్నప్పుడు ఆ సంయమనం తప్పక లభిస్తుంది."

- ఆరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి
('నెమలికనులు'లో దీపతో గౌరీనాథ్)

పెళ్ళి పేరిట చాకిరి చేయడానికి పనిమనిషిగా అమ్మడానికి సిద్ధపడింది. అప్పటికి నాక్కొంచం జ్ఞానం వచ్చింది గనుక - జీవితానుభవాలు స్కూల్ కంటే కాలేజీలో కంటే ఎక్కువ పాఠాలు నేర్పాయి గనుక, ధైర్యంగా పరిస్థితిని ఎదిరించ గలిగాను. ట్యూషన్లు చెప్పుకొని నా ఖర్చులకు డబ్బు నేనే సంపాదించుకొని కాలేజీలో చేరాను. స్కాలర్ షిప్ సంపాదించుకో గలిగాను. ఇంటికొస్తే సవతి తల్లి పని చెపుతుందని ఇంటికి వెళ్ళకుండా పుస్తకాలు చదువుకుంటూ లైబ్రరీలోనే ఉండిపోయేదాన్ని. నా తిండి ఖర్చు తప్పి పోయిందని నా సవతి తల్లి ఆనందించింది. దొరికింది తింటూ మరి ఎలాగోలా కష్టపడి చదువుకొని బి.ఎ. ప్యాసయి ఇప్పుడు కూడా మెరిట్ స్కాలర్ షిప్‌తోనే ఎమ్.ఏ. చదువుతున్నాను. ఇప్పుడు చెప్పు నిన్ను ప్రాణంకంటే అధికంగా ప్రేమించే అమ్మ ఉంది నీకు. పదేండ్లు దాటిన దగ్గర నుంచి తిట్లు చివాట్లు విదిలింపులు తప్ప ప్రేమ అంటే ఎలా ఉంటుందో తెలియకుండా పెరిగాను. నీలా డ్రగ్ ఎడిక్ట్ నయ్యానా? లోకంలో ఏ మనిషికీ పరిస్థితులు కావలిసినట్లు ఉండవు. డ్రగ్స్‌కు బానిస కావటం నీ మానసిక బలహీనతని చాటి చెపుతోంది. నిజానికి మానవుడు ఆత్మ విశ్వాసంతో అధిగమించలేని సమస్యలంటూ ఉండవేమో! సంఘర్షణలకు బాధలకు భయపడి ఎంత దూరం పారిపోగలం. వాటిని తట్టుకొని జీవితాన్ని మన అదుపులోకి తెచ్చుకోవాలి."

చప్పట్లు కొట్టింది రీటా.

"చిన్నారీ నీ ఉపన్యాసం బ్రహ్మాండంగా ఉంది. కానీ, ఒక ధర్మ సూత్రం మర్చిపోయావు. నువ్వు ఇల్లొదిలి పనిమనిషిగా వెళ్ళి పోయినపుడు పెద్ద మనుషులంతా వచ్చి మీ నాన్నని తిట్టారు. అలా నీకు సంఘం నుండి రక్షణ దొరికింది. రామ్ రెండో నాన్న రామ్‌ని తిట్టినా కొట్టినా ఏ పెద్దమనుషులూ అడ్డుకోవడానికి రాలేదు. పైగా రామ్‌ని రామ్ తల్లిని మరింత మాటలతో గుచ్చి గుచ్చి వేధించారు. అంతేనా! నీ ఇంట్లో నీకు ఎంత నరకంగా ఉన్నా కనీసం బయటి సమాజంలో నీకు సానుభూతి, గౌరవం ఉన్నాయి. 'అయ్యో! తల్లి లేని బిడ్డ' అని నిన్ను సింపతీతో చూసింది సమాజం. అలా సింపతీ ఓట్లు చాలా సంపాదించుకున్నావు. ఆ సింపతీ ఓట్ల సహాయంతోనే మెరిట్ స్కాలర్ షిప్‌లు సంపాదించుకున్నావు. అఫ్‌కోర్స్! మెరిట్ లేదని కాదనుకో, మెరిట్‌కి ఈ సింపతీ కూడా తోడైందని. ఇంట్లోనూ రామ్‌కు భయంకర నరకమే. బయట అంతకు మించిన అ గౌరవ నరకం. రామ్ నుద్దేశించి వేళాకోళంగా మాట్లాడుకొని నవ్వు కోటానికి విద్యాధికులైన ప్రొఫెసర్లే సంకోచించటం లేదు. అతని పరిస్థితి ఆలోచించుకో! ఏయ్ మిస్టర్! నేనిలా మాట్లాడుతున్నానని నీ డ్రగ్ ఎడిక్షన్‌ను సమర్థిస్తున్నానని అనుకోవద్దు. నా సంగతే చూడు. నాకు నీలాగే సింపతీ ఓట్లు లేవు. మా నాన్న మా అమ్మకి డైవోర్స్ ఇచ్చి మరో పెళ్ళి చేసుకున్నాడు. మా అమ్మకూడా మరొకాయనను పెళ్ళి చేసుకుంది. మనం బంతిలా ఆ ఇంటికీ ఈ ఇంటికీ మధ్య తిరుగుతూంటాం. ఎక్కడా ప్రేమ బిచ్చం దొరకదు. మా రెండో నాన్న క్రిష్టియన్ గనుక ఎందుకైనా మంచిదని రీటాగా మారిపోయాను. స్వంత నాన్న దగ్గరికి రేవతిగా వెళ్తాను. అయితే వాళ్ళ పుణ్యమాని నా ముఖాన ఇన్ని డబ్బులు పారేస్తారులే. అంచేత నా బతుకు బతికేస్తున్నాను. ఫెమినిస్టు మూమెంట్ మరో కోణానికి ప్రతినిధులమేమో మనం. అటు మా అమ్మ తల్లిదండ్రులు, ఇటు మా నాన్న తల్లిదండ్రులు నన్ను కొంచెం కూడా ముద్దు చేయరు, సరికదా! ఏదో వింత మృగాన్ని చూసినట్లు చూస్తారు. మిగిలిన మనవలని, మనవరాళ్ళని ఎంతో గారాబం చేస్తారు. ఒకే ఇంట్లో నా తోటి పిల్లల్ని గారాబం చేస్తూ నన్ను వేరు పెట్టినట్లుగా చూస్తూ ఉంటే, ఆ క్షోభ ఎలా ఉంటుందో ఊహించగలవా! అమ్మ వైపు అమ్మమ్మ తాతయ్య నాన్నవైపు నానమ్మ తాతాయ్య ఇంతే. అంచేత భాయీ! మనం డ్రగ్ బానిసలం కావడానికి ఈ చిన్న చిన్న సమస్యలు దుఃఖాలు కారణాలుగా చూపించుకోగూడదు." రామ్ తలదించుకొని కూర్చుండిపోయాడు. నిజమే విలియమ్ వచ్చి డ్రగ్స్ అలవాటు చేసాక దానికి బానిస అయిపోయాడే తప్ప కేవలం పరిస్థితుల కారణం వల్లనే డ్రగ్‌కి బానిస కాలేదు కదా. ఇది వీళ్ళంతా అంటున్నట్లు మానసిక బలహీనత. విలియమ్‌కి ఏం సమస్యలున్నాయి! అతడు ఇండస్ట్రియలిస్ట్ కొడుకు. ఎలాగోలాగ డిగ్రీ సంపాదించుకొని తండ్రి బిజినెస్‌లోకి దిగిపోయాడు. చేతినిండా డబ్బు ఆడుతోంటే కేవలం సరదా కోసం ఈ వ్యసనానికి లొంగి పోయాడు. భరించలేని సమస్యలు ఉండటం వల్లనే మత్తు మందులకి బానిసలవుతారని అనుకోనక్కర లేదు.

శేఖర్ హడావుడిగా వచ్చాడు.

'రామ్ నీకో న్యూస్ చెప్పక తప్పదు. నీ పరిస్థితి చూసి నిన్నింకా క్షోభ పెట్టలేక మీ అమ్మ నీ రెండో నాన్నని వదిలేసింది. వెంటనే ఏ ఉద్యోగం దొరక్క ఫ్యాక్టరీలో కూలీగా చేరింది. అలాంటి పనులు అలవాటు లేకపోవడం వల్ల ఆవిడకి హార్ట్ ఎటాక్ వచ్చింది. నిమ్సులో ఎమర్జెన్సీ వార్డులో ఉంది. మనం వెంటనే వెళ్ళాలి."

లీల చటుక్కున లేచి నిలబడింది.

'రామ్! నువ్వొస్తే రా! లేకపోతే లేదు. నేను మాత్రం వెళ్తున్నాను. నా దృష్టిలో ఆవిడ ఈ లోకంలోని పతివ్రత లందరికంటే పవిత్ర. వర్థి అమ్మ"


....లీల, రామ్ వెళ్ళే సరికి నిమ్సు హాస్పటల్‌లోని ఎమర్జెన్సీ వార్డులో రామ్ తల్లి దగ్గర రామ్ రెండో నాన్నకూడా ఉన్నాడు. ఆవిడకి ఆక్సిజన్ ఎక్కిస్తున్నారు. కళ్ళు తెరిచి చుట్టూ చూసి మళ్ళీ మూసుకుంది. తెలివిలోనే ఉంది. రామ్ వచ్చి తల్లి కాళ్ళ దగ్గర స్టూల్ మీద కూర్చున్నాడు. ఒకసారి సవతి తండ్రి వైపు చూసి తల దించుకున్నాడు. అతను లేచి రామ్ దగ్గరికి వచ్చి "హౌ ఆర్‌యూ, మై బోయ్" అన్నాడు. అతడు ఆ మాత్రం ఆదరంగా మాట్లాడటం అదే మొదటిసారి. రామ్ చటుక్కున ఆయన రెండు చేతులు పట్టుకొని "అయాం వెరీ సారి అంకుల్! వెరీ వెరీ సారీ - చాల హీనంగా ప్రవర్తించాను."

రామ్ ఆ మాత్రం వినయంగా - తన తప్పు ఒప్పుకోవటం అదే మొదటిసారి. అప్పటి వరకు అతను ఆయన్ని శత్రువులా చూసేవాడు. ఆయన రామ్ వెన్ను తట్టి "దట్సాల్ రైట్ మై బోయ్! నువ్వు చాలా లక్కీ ఫెలోవి. డ్రగ్స్ బ్రహ్మ రాక్షసి నోట్లోంచి బయట పడ్డావు. నీ స్నేహితుల్ని మనసారా అభినందించాలి" అన్నాడు.

లీల,శేఖర్ గర్వంగా నవ్వుకున్నారు.

సందడికి కళ్ళు తెరిచింది రామ్ తల్లి. ఒకరి చేతులలో మరొకరి చేతులుంచి చిర్నవ్వుతో మాట్లాడుకొంటున్న కొడుకుని, రెండో భర్తని చూసి ఆవిడ కళ్ళు తళుక్కున మెరిసాయి.

విపరీతమైన అలసటతో నోరు విప్పి మాట్లాడలేక పోయింది. కానీ మాటలకందని భావాల్ని ఆవిడ కళ్ళు పలికాయి.



మనవాళ్ళు ఈ 'మానం' అన్న పదానికి అనవసరంగా ప్రాముఖ్యత ఇచ్చి స్త్రీకి ప్రాణం కన్నా మానం గొప్ప, స్త్రీ మానం కాపాడుకుంటూ పవిత్రంగా వుండాలి. మానం పోతే ప్రాణం వున్నా లేకపోయినా ఒకటేనని అనేక పతివ్రతల కథలు చెప్పి అనేక యుగాలుగా స్త్రీకి ఆ భావం నరనరాల్లో వెళ్ళేటట్లు చేశారు.

ఏం పురుషుడికి మానం అక్షరలేదా? నీతి నియమాలన్నీ స్త్రీకేనా? ఎవరో ఏదో చేసిన మాత్రాన తప్పు తనది కాకపోయినా స్త్రీ ఎందుకు శిక్ష అనుభవించాలి? కావాలని పదిమంది స్త్రీలతో పురుషుడు తిరిగినా అతనికి అంటని అపవిత్రత, కర్మవశాత్తు మానం పోయిన స్త్రీకి ఎందుకు అంటాలి?

- డి. కామేశ్వరి

('శుభోదయం'లో రేఖతో రాధాదేవి)